క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి పంచాయతీ కార్యాలయంలో శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేత్ర సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యులు పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీ



దుకాణంలో తనిఖీ చేస్తున్న అటవీ అధికారులు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాల్లో నిషేధిత చైనా తయారీ మాంజా దారం అమ్మకాలు కొనసాగుతున్న పలు దుకాణాల్లో శనివారం అటవీశాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా దారం అమ్ముతున్న మూడు దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి ఖుద్బొద్దీన్ తెలిపారు. చైనా తయారీ మాంజాను ప్రభుత్వం నిషేధించిందని దీనిని అమ్మితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎల్ఈడీ లైట్లు అందజేత



ఎల్ఈడీ లైట్లను అందజేస్తున్న దాతలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి దాతలు శనివారం ఎల్ఈడీ లైట్లు అందజేశారు. హైదరాబాదుకు చెందిన శ్రీనివాస్, వినోద్‌లు ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు 10 ఎల్ఈడీ లైట్లను ఆలయ ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు వస్తు, ధన రూపంలో సాయం ఇవ్వాలని ఆలయ ఈఓ శశిధర్ గుప్తా కోరారు.

ఆరు గ్యారంటీలపై కళాజాత

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో ప్రభుత్వ పథకాలపై సంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలన, ఆరు గ్యారంటీలతో పాటు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై సంస్కృతిక బృందం సభ్యులు పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంస్కృతిక సారథి టీమ్ లీడర్ ఎల్ల సిద్దులు, సభ్యులు రామారావు, కృష్ణ, ఎల్లయ్య, శేఖర్, దేవదాస్, విజయలక్ష్మి, నర్సమ్మ పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లి గ్రామ శివారులో అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా రంగాయపల్లి శివారు నుంచి కోండాపూర్‌కు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో వెళ్లి పట్టుకున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

పేకాటరాయిళ్ల అరెస్ట్



పేకాట ఆడుతున్న అప్పాజీపల్లి గ్రామస్తులు

అల్లాదుర్గం(మెదక్): అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 14 మందిపై కేసు నమోదు చేసిన సంఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అప్పాజీపల్లి గ్రామ శివారులోని చెరువు వద్ద పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేయగా.. 14 మంది జూదరులను పట్టుకొని, 12 వేల రూపాయలు స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నట్లు తెలిపారు.

భగీరథ.. ఇదేమి వ్యథ

- అడుగడుగునా లీకేజీలు
- పొలాల్లోకి పైప్‌లైన్ల తాగు నీరు
- పట్టించుకోని అధికారులు



నడిమితండా వద్ద లీకేజీ అయిన భగీరథ పైపు

అల్లాదుర్గం(మెదక్): ఏళ్ల తరబడి మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీ అవుతున్న పట్టించుకునే నాథుడే లేడు. అడుగడుగునా లీకేజీలు అవుతున్నాయి. పైపులు పగిలి ప్రమాదాలు జరిగినా.. అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పైపుల లీకేజీలో నీరు వ్యవసాయ పొలాల్లోకి వెళ్తుంది. ఇదే అదనుగా భావించి కొందరు లీకేజీ నీటిని వ్యవసాయానికి వాడుతుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. పట్టించుకునే వారే దిక్కులేరు. ఈ సంఘటన అల్లాదుర్గం మండలంలో చోటు చేసుకుంది.

మండల పరిధిలోని నడిమితండా నుంచి చిల్వెర వరకు మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతోంది. చిల్వెర ప్రాంతంలోని ఓ వెంచర్ ముందు ఏళ్ల తరబడి పైపు లీకేజీ అవుతుంది. లీకేజీతో నీరంతా వ్యవసాయ పొలాల్లోకి వెళ్తుంది. గతంలో పైపు పగిలి రోడ్డు పైకి నీళ్లు రావడంతో బైక్‌పై వెళ్తున్న ప్రయాణికులు ప్రమాదానికి గురయ్యారు. ఇటీవలే నడిమితండా వద్ద పైపు లీకేజీతో నీటి గుంతగా మారింది. అధికారులు, కాంట్రాక్టర్ మాత్రం ఆటు వైపు కన్నెతి చూడటం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ పైపులైన్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. కాంట్రాక్టర్, మిషన్ భగీరథ సిబ్బంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో, నిధులు ఎమవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీ మరమ్మతులు యుద్ధ ప్రాతిపాదికన చేపట్టాలని వారు కోరుతున్నారు.

ముగ్గులు వేయడం ఒక కళ



నర్సాపూర్‌లో ముగ్గు వేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



తూప్రాన్: బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

నర్సాపూర్: ముగ్గులు వేయడం ఓ కళ అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ప్రసాద్ శనివారం తమ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ వేళ ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషదాయకమని చెప్పారు. ముగ్గులు వేయడం అంత తేలిక కాదన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ముగ్గు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్, ప్రసాద్, భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రవన్, నాగరాజుగౌడ్, వెంకటేష్, షేక్ హుస్సేన్, ఉదయ్‌గౌడ్, బాల్‌రాజ్, శ్రీకాంత్, శ్రీనివాస్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: పట్టణంలోని 6వ వార్డులోని కాలనీ వాసులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నర్సింహరెడ్డి, కాశీరెడ్డి, బ్రహ్మయ్య, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని శమ్నాపూర్ గ్రామంలో సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లేశం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజలు భక్తి మార్గంలో నడవాలి

రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతీ

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రజలు భక్తిమార్గంలో నడవాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి పేర్కొన్నారు. మండల కేంద్రం కౌడిపల్లిలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పురోహితుడు రాజేశ్వరశర్మ పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ పద్మ నర్సింహరెడ్డి 41 శనివారాలు ఆంజనేయస్వామికి చందన అలంకరణ, నవగ్రహ దేవత పూజలు చేశారు. ఈ శనివారంతో 41 వారాల పూజలు పూర్తికావడంతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి మాధవానంద సరస్వతీస్వామి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పుజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. ప్రజలు భక్తిమార్గంలో నడవాలని చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు.

అప్రమత్తంగా ఉండండి

హవేళిఘణాపూర్(మెదక్): పండగ వేళ ప్రజలు ఊరిని విడిచి తాళం వేసిన సమయంలో తమకు సమాచారం అందించి వెళ్లాలని హవేళి ఘణాపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వివిధ పట్టణాల నుంచి ఇంటికి వచ్చే సమయంలో వాహనాలపై జాగ్రత్తగా రావాలని, ముఖ్యంగా తాళాలు వేసిన ఇంటి వివరాలను పోలీసులకు అందిస్తే నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు.

భూమి కోసం వేధింపులు



బేసిక్‌బ్రీడర్ సీఎండీ లక్ష్మీబంజార

కౌడిపల్లి(నర్సాపూర్): భర్త, కొడుకు చనిపోయిన దుఃఖంలో ఉండగా భూమి అమ్మాలంటూ తనను వేధిస్తున్నారని మండలంలోని నాగ్సాన్‌పల్లి శివారులోని బేసిక్‌బ్రీడర్స్ ఇండియన్ పౌల్ట్రీఫాం ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ లక్ష్మీబంజార ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాగ్సాన్‌పల్లి శివారులోని 2002లో బేసిక్‌బ్రీడర్స్ కొనుగోలు చేశామన్నారు. 93 సర్వే నంబర్‌లో 82 ఎకరాలు ఉండాల్సి ఉండగా 53 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వేచేసి, అటవీభూమిలో తమకు రావాల్సిన భూమికి హద్దులు చూపించడంతో కడీలు వేస్తే.. గ్రామస్తులు వాటిని ధ్వంసం చేస్తున్నారన్నారు. తన భర్త లచ్చిరాంనాయక్, కొడుకు మృతితో బాధలో ఉండగా.. రాజకీయ పలుకుబడితో గ్రామ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమి అమ్మాలని తనను వేధిస్తున్నారన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు



నర్సాపూర్‌రూరల్: నత్నయపల్లిలో ..

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. నవాబుపేట, మగ్దుంపూర్ తదితర గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీఎం జీవనజ్యోతి, సురక్ష బీమా, వ్యవసాయ సాగులో అగ్రిగోన్ పిచికారీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి అశోక్, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

నర్సాపూర్‌రూరల్: మండలంలోని నత్నయపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయమ్మ, బీజేపీ మండలాధ్యక్షుడు నగేష్, పోచన్న, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణ సంతోషకరం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: క్రీడల నిర్వహణ సంతోషకరమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సుల్తాన్ క్రికెట్ టీం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ప్రీమియంలీగ్ క్రికెట్ టోర్నమెంట్ 2024 సీజన్ – 4 పోటీలను ప్రారంభించారు. శనివారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ సమయంలో క్రికెట్ పోటీలు చేపట్టడం అభినందనీయమన్నారు. క్రీడలు ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నయిమోద్దీన్, జెడ్పీటీసీ బబియా నాయక్, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యంగౌడ్, భిక్షపతి, సామ్యానాయక్, శ్రీకాంత్, కృపాచారి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం



కార్యాలయంలో పేరుకుపోయిన దరఖాస్తులు

తూప్రాన్: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో రెవెన్యూ అధికారుల జాప్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ పథకాలు, విద్యార్థులు, ఇతర అవసరాలకు కుల, ఆధాయ, స్థానిక ధ్రువపత్రాల కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నవారు రెవెన్యూ అధికారుల జాప్యంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో ధ్రువపత్రాలు అందజేయాలన్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణంలో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో పురోహితుడు దేవాదత్తశర్మ ఆధ్వర్యంలో రంగనాయక గోదాదేవి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. ఏటా గ్రామంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ఇంటింటికీ రామయ్య అక్షింతలు



కొల్చారం(నర్సాపూర్): పోతంశెట్టిపల్లిలో ..

జిల్లాలోని వివిధ మండలాల్లో, గ్రామాల్లో శనివారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలకు పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వాటిని అందజేశారు.



కౌడిపల్లి రామాలయంలో అయోధ్య అక్షింతలతో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో ..



నర్సాపూర్‌రూరల్: గొల్లపల్లిలో..



వెల్దుర్తి(తూప్రాన్): చెర్లపల్లిలో..

జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి



కోదండరాంకు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్: మెదక్ జిల్లాను చార్‌మినార్‌జోన్‌లో కలిపేందుకు సహకరించాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు పలువురు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. శనివారం హైద్రాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కోదండరాంను జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్ రవిశంకర్‌రెడ్డి, సాయిరాం తదితరులు కలిసి మాట్లాడారు. జిల్లా ప్రజలకు జరుగుతున్న నష్టాలను వివరించారు.

సంక్షిప్త వార్తలు

◆ మంత్రిని కలిసిన మండల నాయకులు



టేక్మాల్(మెదక్): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం సంగారెడ్డిలోని తన స్వగృహంలో మండల నాయకులు కలిశారు. మంత్రిని కలిసి శాలువాతో సన్మానించారు. పౌల్ట్రీ రైతులు సమస్యలను మంత్రికి వివరించగా, సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారన్నారు. ఇందులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు కిషోర్, రాజేశ్‌గౌడ్, రాజు, సేవ్యానాయక్, సక్రునాయక్, రాజు తదితరులు ఉన్నారు.

◆ చికిత్స పొందుతూ మృతి



రాములు (ఫైల్)

పాపన్నపేట(మెదక్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాజ్యా తండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్ఐ గాలయ్య కథనం మేరకు.. తండాకు చెందిన రాములుకు ఇద్దరు భార్యలున్నారు. కుటుంబంలో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 12న మొదటి భార్య సక్రూ బాయికి రాములుకు చిన్న పాటి గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన రాములు అదే రోజు పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని మెదక్ ఆస్పత్రికి తీసుకెళ్లగా శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

◆ చెక్ పవర్ రద్దుపై స్టే

పాపన్నపేట(మెదక్): చెక్ పవర్ రద్దుపై హైకోర్టు స్టే విధించినట్లు కొత్తపల్లి సర్పంచ్ జగన్నాథం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తన చెక్ పవర్ రద్దు చేస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించగా స్టే లభించినట్లు తెలిపారు. ఈ విషయమై డీపీఓ సాయిబాబాను వివరణ కోరగా.. తమకు ఇంకా ఉత్తర్వులు అందలేదని తెలిపారు.

◆ సేవ కార్యక్రమాలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. లయన్స్ ఫౌండర్ మెల్విన్ జాన్సన్ జయంతి సందర్భంగా చేగుంటలో యశోద ల్యాబ్‌లో ఉచిత డయాబెటీస్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు అనీల్‌కుమార్, సభ్యులు బుర్క నాగరాజు, శ్రీనివాస్, బోగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి



సలీం(ఫైల్)

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్‌లో రిటైర్డ్ ఉపాధ్యాయుడు సలీం(80) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. రసాయన శాస్త్రం బోధనలో తనదైన ముద్ర వేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

◆ వైభవంగా కల్కి నారాయణదాస్ ఆరాధనోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో వెలసిన కల్కి నారాయణదాస్ 41వ ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగింది. శనివారం చిన్నశంకరంపేటలోని గురు కల్కి నారాయణదాస్ ఆలయం వద్ద ఉదయం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు రాజేశ్వర్, జాల దాస్, ఎర్రగంటి కిష్టయ్య, వెంకటి, కిష్టయ్య పాల్గొన్నారు.

◆ క్రికెట్ పోటీలు ప్రారంభం



రామాయంపేట(మెదక్): మండలంలోని ఆర్‌వెంకటాపూర్‌లో శనివారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం సంఘ సేవకులు వెంకుగారి రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలో గెలుపొందే విన్నర్‌టీంకు రూ. 15 వేలు, రన్నర్ టీంకు రూ. 5 వేలు నగదు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.